# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 238 పేజీలు : 8 వెల : రూ.2/- మంగళవారం 22 సెప్టెంబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# కుప్పం ఓటుతోనే అభివృద్ధికి ఊతం

● ఎన్నికలొస్తే కనిపించేది సైకిలే ● కూటమి అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత మీదే

● ఇక్కడ రక్తాభిషేకాలకు చోటు లేదు ● బహిరంగ సభలో సీఎం చంద్రబాబు



**కుప్పం,మన జనప్రగతి సెప్టెంబర్ 21**: 'అంతా మంచివాళ్లు ఉన్నది కుప్పమేనని నేను నమ్ముతా. ఎన్నికలొస్తే ఇక్కడి ప్రజలకు కనిపించేది సైకిలే. సైకిలెక్కి ఓట్లు వేస్తారు. నేను అభివృద్ధి, సంక్షేమాన్ని ఇస్తున్నా. కూటమి అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత మాత్రం మీదే' అని కుప్పం ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేటలో సోమవారం ఆయన రూ.38 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, రూ.289 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. అక్కడే జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. 'వైసీపీ అనేది రాజకీయ పార్టీ కాదు. నేరస్తులను మిగతా2లో...



# పచ్చదనం పరిమళం.. పీఠికాపుర వనం ఆవిష్కారం

● నగర వనాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ● కేంద్ర ప్రభుత్వ నగర వన్ యోజన పథకం కింద రూ. 1.83 కోట్లతో నిర్మాణం ● ఆహ్లాదం, ఆధ్యాత్మికతల కలబోతగా పిఠాపురం నగర వనం ● ప్రత్యేక ఆకర్షణగా నక్షత్ర వనం, శివ పంచాయతన వనం ● 70 సెంట్ల విస్తీర్ణంలో మియావకీ ప్లాంటేషన్‌ను ఆసక్తిగా తిలకించిన ఉప ముఖ్యమంత్రి ● ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 18 నగరవనాలు ప్రారంభించిన పవన్ కళ్యాణ్

**పిఠాపురం మన జనప్రగతి సెప్టెంబర్ 21**: నియోజకవర్గ ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంతోపాటు, పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో అభివృద్ధి చేసిన 'పీఠికాపుర వనం' నగర వనాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీపర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా సోమవారం నగర వనంలో మొక్క నాటి, పీఠికాపురవన ప్రారంభ సూచకంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ నగర వన్ యోజన పథకం కింద సుమారు రూ. 1.83 కోట్ల వ్యయంతో ఆరు ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఈ నగరవనం పిఠాపురం పట్టణానికి సరికొత్త హరిత సొబగులను అద్దింది. మిగతా2లో...

# ఏపీలో అతిభారీ వర్షాలు..

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి: హోం మంత్రి అనిత



**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 21**: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఏపీలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఈరోజు (సోమవారం) సచివాలయంలో కలెక్టర్లు, ఎస్పీలు, విపత్తుల సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, ఉన్నత అధికారులతో అత్యవసర టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై హోం మంత్రి అనిత దిశానిర్దేశం చేశారు. వంశధార, నాగావళి నదులు పొంగే అవకాశం ఉంది. మిగతా2లో...

# గురువులపై దాడి ఘటన.. ఏపీ ప్రభుత్వం సీరియస్



**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 21**: విజయవాడలో డీఎస్సీ స్పోర్ట్ కోటా ఉపాధ్యాయులపై జరిగిన దాడి ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. దాడి చేసిన వారిని గుర్తించి ఎవరినీ వదిలి పెట్టవద్దని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించింది. దాడి ఘటనలో పాల్గొన్న వైసీపీ నేతలు, రౌడీ షీటర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. సీసీటీవీ, వీడియో ఫుటేజ్‌లను పరిశీలించి దాడిలో పాల్గొన్న వారిని గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. దాడిలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకోవాలని విజయవాడ పోలీస్ కమిషనర్‌ను ఉన్నతాధికారులు ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ రూంలో వీడియో ఫుటేజ్‌ను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దాడికి సంబంధించి మొత్తం మూడు లేదా నాలుగు క్రిమినల్ కేసులు మిగతా2లో...


# వైసీపీకి షాక్.. కీలక నేత రాజీనామా



**కాకినాడ మన జనప్రగతి సెప్టెంబర్ 21**: వైసీపీకి ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు రాజీనామా చేశారు. జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. సుబ్బారావుకు జనసేన కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

మిగతా2లో...

# టీచర్లపై వైసీపీ దాడి.. వదిలే ప్రసక్తే లేదంటూ మంత్రి లోకేశ్ వార్నింగ్



**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 21**: విజయవాడలో డీఎస్సీ స్పోర్ట్ కోటా ఉపాధ్యాయులపై వైసీపీ నేతలు దాడి చేయడంపై మంత్రి లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. గురువులపై దాడి చేసిన వారిని ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. గురువులపై దాడి చేసిన క్రిమినల్ గ్యాంగ్‌లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని.. వాళ్ల భరతం పడతామని వార్నింగ్ ఇచ్చారు. అందరూ దైవంలా భావించే గురువులను వైన్ షాపులకు కాపలా పెట్టిన జగన్.. ఉపాధ్యాయులను గౌరవిస్తారని అనుకోవడం భ్రమ అని అన్నారు. అత్యుత్తమ ఆటతీరుతో రాష్ట్రం, దేశ సత్తాను ప్రపంచానికి చాటిన క్రీడాకారులను

మిగతా2లో...



# టీచర్లపై దాడులను ఉపేక్షించేది లేదు: మంత్రి సవిత

**పెనుకొండ మన జనప్రగతి సెప్టెంబర్ 21:-** ఉపాధ్యాయులు, సామాన్యులపై దాడులకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత హెచ్చరించారు. సోమవారం పెనుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద తమ సమస్యలను వివరించేందుకు వచ్చిన ఉపాధ్యాయులపై దాడులు చేయడం సరికాదని మంత్రి అన్నారు. ఉపాధ్యాయులను సమాజం గౌరవిస్తుందని,

మిగతా2లో...

# సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు షాక్

● పౌరసత్వం కేసులో దర్యాప్తునకు ఆదేశాలు ● పౌరసత్వం పొందడానికి మూడేండ్ల ముందే ఎన్నికల జాబితాలో సోనియా పేరు ఉందని ఆరోపణలు ● గతంలో దీనిపై దర్యాప్తును తిరస్కరించిన మేజిస్ట్రియల్ కోర్టు

తాజాగా దాన్ని కొట్టివేస్తూ ఆదేశాలు


2లో

మన జనప్రగతి
22 - 09 - 2026

# కుప్పం ఓటుతోనే అభివృద్ధికి ఊతం

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించే పార్టీ. హత్యలు, దాడులు చేసే పార్టీ. రేపటి ఎన్నికల్లో వాళ్లు ఒక్క వార్డు మెంబర్ కానీ, కౌన్సిలర్ కానీ గెలవకూడదు. అది గొడ్డలి పార్టీకి మరిచ్చే సమాధానం అవుతుంది. నేను మీ అందరి ఆమోదంతోనే అభ్యర్థులను నిలబెడతాను. గెలిపించు కునే బాధ్యత మీదే' అని చంద్రబాబు అన్నారు. నారావారిపల్లె తనకు జన్మనిస్తే, కుప్పం రాజకీయ జీవితాన్ని ఇచ్చిందని భావోద్వేగంతో అన్నారు. ఒక అన్నగా, తమ్ముడిగా కుప్పం కుటుంబాలలో తానూ ఒక సభ్యుడినేన్నారు. అందువల్ల కుప్పం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదల గురించే నిరంతరం ఆలోచిస్తుంటానన్నారు. **ఎంతో అభివృద్ధి చేశాం** కుప్పంలో జీడీపీ 37 శాతం, తలసరి ఆదాయంలో 35 శాతం పెరిగిందని సీఎం చంద్రబాబు వివరించారు. 'రూ.9,872 కోట్ల పెట్టుబడులతో 32 పరిశ్రమలు వచ్చాయి. 80,124 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. స్థానిక యువతకే కచ్చితంగా ఉద్యోగాలు ఇవ్వాలి. నియోజకవర్గంలో 8,904 బంగారు కుటుంబాలకు పీ4 ద్వారా ఆదాయ మార్గం చూపించి, జీవన ప్రమాణాలను పెంచుతున్నాం. 82 కేంద్రాల ద్వారా చెత్తను ప్రాసెస్ చేసి ఆదాయ వనరుగా మారుస్తున్నాం. చెత్తనుంచి సంపదను వృద్ధి చేసే ప్రాజెక్టులకు రూపకల్పన జరిగింది. చెత్తనుంచి విద్యుత్తు తయారు చేయడమూ ఇందులో భాగమే. కుప్పం నియోజకవర్గంలో 8 వేల ఇళ్లకు సోలార్ విద్యుత్తు ప్యానళ్లు అమర్చాం. వ్యవసాయానికీ దీనిని అమలు చేస్తాం. కుప్పం ఏరియా ఆస్పత్రి, 13 పీహెచ్‌సీలను కలిపి 1.25 లక్షల మందికి సంజీవిని ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాం. శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.34 కోట్లతో 134 ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. కంగుందిలో ఇటీవల భూ వివాదాన్ని పరిష్కరించి 320 మందికి పట్టాలు పంపిణీ చేశాం' అని చంద్రబాబు అన్నారు. **మోడల్ నియోజకవర్గంగా కుప్పం!** కుప్పాన్ని మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు ప్రణాళికలను తయారు చేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. కుప్పం మున్సిపాలిటీలో రూ.3.30 కోట్లతో సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ మెటీరియల్ రికవరీ ప్లాంట్ ప్రారంభించాం. యామగానిపల్లె, మాదనపల్లె ప్రాంతలో రిజర్వాయర్ నిర్మాణానికి ప్రణాళిక వేస్తున్నాం. కుప్పంలో 550కుపైగా మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను లిఫ్ట్ ఇరిగేషన్ పైపులైన్లతో అనుసంధానం చేస్తాం. పశు పోషణ, ఫౌల?ట్ర రంగాలలో ఉపాధి అవకాశాలను, ఆదాయ మార్గాలను పెంచుతున్నాం. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనతో రైతుల ప్రయోజనాలను, లాభాలను ద్విగుణీకృతం చేస్తాం. కుప్పం, పొగురుపల్లె, కేజీఎఫ్ మీదుగా బెంగళూరుకు, పలమనేరు నుంచి కృష్ణగిరికి ఫోర్‌లేన్ రోడ్లను నిర్మించి ఇతర నగరాలకు అనుసంధానం పెంచుతున్నాం. చిత్తూరు నుంచి కుప్పానికి రైల్వే బ్రాడ్ గేజ్ చేయడానికి ప్రణాళిక వేస్తున్నాం. త్వరలోనే విమానాశ్రయం ఏర్పాటు చేయనున్నాం' అని చంద్రబాబు తన ప్రణాళికలను వెల్లడించారు. **అభివృద్ధి కావాలా.. రౌడీయిజం కావాలా?** 'రక్తాభిషేకాలు చేస్తారట. చావడానికైనా, చంపడానికైనా సిద్ధంగా ఉండాలట. ఈ మాటలు కుప్పంలో వినడం విడ్డూరంగా ఉంది. మిమ్మల్ని చంపేవాళ్లు లేరు. చంపనిచ్చే వాళ్లూ లేరు. తోక విసిరితే కత్తిరిస్తాం' అని ప్రతిపక్షంపై చంద్రబాబు ధ్వజమెత్తారు. వీళ్లను మెంటల్ అనాలా? సైకోలనాలా? అయిదేళ్లూ నేరస్తుల అడ్డాగా మార్చారు. ఇప్పుడు మీ ఆటలు చెల్లవు. 'మీకు అభివృద్ధి కావాలా? రౌడీయిజం కావాలా?' అని ప్రజలను ప్రశ్నించారు. 'స్థానిక సంస్థల ఎన్నికల్లో మీరు వేసే ఓట్లే వారికి గుణపాఠం కావాలి' అని సూచించారు.

# పచ్చదనం పరిమళం.. పీఠికాపుర వనం ఆవిష్కారం

(మొదటి పేజీ తరువాయి)


గతంలో పూర్తిగా డంపింగ్ యార్డుగా, అపరిశుభ్రతకు నెలవుగా ఉన్న ప్రాంతం శ్రీ పవన్ కళ్యాణ్ గారి ప్రత్యేక చొరవతో నేడు పచ్చదనపు పరిమళాలు వెదజల్లుతూ, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే నగరవనంగా మారింది.పిఠాపురంకు ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని నగరవనంలో ఆహ్లాదం, ఆధ్యాత్మికతల సమ్మేళనంగా తీర్చిదిద్దారు. అందులో ముఖ్యంగా నక్షత్రవనం, శివపంచాయతన వనం సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అటవీ శాఖ అధికారులు ఈ రెండింటి ప్రాధాన్యతను శ్రీ పవన్ కళ్యాణ్ గారికి వివరించారు. 27 నక్షత్రాలకు ప్రతీకగా నిలిచే ఉసిరి, మేడి, మోదుగ, కొండమామిడి, పిప్పలి, వెదురు, రావి, మర్రి, జాతి జువ్వి, దేవదారు, పనస, జిల్లేడు, జమ్మి, విప్ప, వేప తదితర రకాల మొక్కలను ఒక వరుస క్రమంలో నాటగా, ప్రతి మొక్కను ఉప ముఖ్యమంత్రివర్యులు ఆసక్తిగా తిలకించారు. శివ స్వరూపమైన మారేడుతో పాటు వినాయకుడు, విష్ణువు, అమ్మవారు, సూర్యభగవానుడి స్వరూపాలైన మొక్కలను శివ పంచాయతనంగా ఏర్పాటు చేశారు. కార్తీక మాసంతోపాటు ప్రత్యేక దినాల్లో ఈ మొక్కలకు ప్రదక్షిణ చేయడం ద్వారా ఆయా దేవతల ప్రదక్షిణ పుణ్యం ప్రాప్తిస్తుందని వివరించారు. ప్రతి మొక్కకు శాస్త్రీయ నామం, వాడుకలో ఉన్న పేరుతో బోర్డులు ఏర్పాటు చేశారు.అనంతరం 70 సెంట్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన మియావకీ ఫారెస్ట్ ప్లాంటేషన్‌ను, బటర్‌ఫ్లై పార్కును, నగరవనం మధ్యన ఉన్న భారీ కొలనును ఉప ముఖ్యమంత్రివర్యులు తిలకించారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలను పెంచుతూ వేగంగా పచ్చదనాన్ని అభివృద్ధి చేసే విధంగా మియావకీ పద్ధతిలో చిట్టడవిని నాటారు. బాక్స్ క్రికెట్, ప్లే కోర్ట్స్ లాంటి మరిన్ని ఆకర్షణలు నగరవనానికి జోడించనున్నారు. పిఠాపురం ప్రజలతోపాటు ఆధ్యాత్మిక సందర్శనార్థం ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని పంచే విధంగా మరింత సర్వాంగ సుందరంగా నగర వనాన్ని తీర్చిదిద్దాలని అధికారులకు సూచనలు చేశారు. అనంతరం గతంలో డంపింగ్ యార్డుగా ఉన్నప్పుడు ఆ ప్రదేశం ఎలా ఉండేది? దాన్ని ఎంత కష్టపడి నగరవనంగా తీర్చిదిద్దారో వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని శ్రీ పవన్ కళ్యాణ్ గారు తిలకించారు. ఈ సందర్భంగా పీఠికాపుర వనాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేసిన అధికారులను అభినందించారు.కేంద్ర ప్రభుత్వ నగర వన్ యోజన పథకం సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పట్టణాల్లో నగర వనాలు అభివృద్ధి చేస్తున్నారు. రూ. 36 కోట్లతో ఏర్పాటు చేసిన 18 నగర వనాలను ఇటీవల శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. కాకినాడ పార్లమెంటు సభ్యులు శ్రీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రూరల్ శాసన సభ్యులు శ్రీ పంతం నానాజీ, ఎమ్మెల్సీ శ్రీమతి కర్రి పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ శ్రీ హరేంధిర ప్రసాద్, పీసీసీఎఫ్ శ్రీ పి.వి. చలపతిరావు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ శ్రీ కళ్యాణం శివశ్రీనివాస్, సివిల్ సప్లయ్స్ కార్పోరేషన్ ఛైర్మన్ శ్రీ తోట సుధీర్, డీసీసీబీ ఛైర్మన్ శ్రీ తుమ్మల రామస్వామి, కౌడా ఛైర్మన్ శ్రీ తలాటం సత్య, రాష్ట్ర అటవీ శాఖ ఐటీ సలహాదారు శ్రీ పెన్నమరెడ్డి నాగబాబు, పడా పీడీ శ్రీ శివరాం ప్రసాద్, సీసీఎఫ్ శ్రీమతి జ్యోతి, కాకినాడ డీఎఫ్ఓ శ్రీ రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు

# గురువుల కష్టార్జితాన్ని 'ఫేక్' అనడం సరికాదు: మంత్రి అచ్చెన్నాయుడు




**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 21 :-** కష్టపడి చదివి, క్రీడల్లో ప్రతిభ చాటి మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులను 'ఫేక్' అంటూ అవమానించడం సరికాదని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఘటనపై స్పందించిన ఆయన, ప్రభుత్వ నిర్ణయాలపై అభ్యంతరాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేయవచ్చని తెలిపారు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని, అయితే భౌతిక ఘర్షణలకు తావులేదన్నారు. ఘటనలో ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మెగా డీఎస్సీ ద్వారా 148 రోజుల్లో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టామని మంత్రి తెలిపారు. నోటిఫికేషన్ నుంచి పరీక్షలు, ఆన్సర్ కీలు, మెరిట్ జాబితాలు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ వరకు నిబంధనల ప్రకారమే ప్రక్రియ నిర్వహించామని పేర్కొన్నారు.స్పోర్ట్స్ కోటా అభ్యర్థులపై అనుమానాలు ఉంటే సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించవచ్చని, అయితే మొత్తం అభ్యర్థులను 'ఫేక్'గా పేర్కొనడం సరికాదన్నారు. క్రీడల్లో ప్రతిభకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం రిజర్వేషన్ కల్పిస్తుందని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 మూల్యాంకనంపై సిట్ పరిశీలనలో వెలుగుచూసినట్లు పేర్కొంటున్న అంశాలపై అప్పటి ప్రభుత్వం వివరణ ఇవ్వాలని అచ్చెన్నాయుడు కోరారు. నియామక ప్రక్రియలపై ఆధారాలతో వచ్చే ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# గురుజాడ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి: మంత్రి కందుల దుర్గేష్




**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 21 :** మహాకవి, సంఘ సంస్కర్త గురుజాడ అప్పారావు ఆశయాలను నేటి తరానికి అందిస్తూ ముందుకు తీసుకెళ్లడం అందరి కర్తవ్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.గురుజాడ జయంతి సందర్భంగా ఆయనకు మంత్రి నివాళులర్పించారు. తెలుగు సాహిత్యంలో గురుజాడ కీలక పాత్ర పోషించారని, 'కన్యాశుల్కం' వంటి రచనల ద్వారా సామాజిక దురాచారాలపై చైతన్యం కలిగించారని తెలిపారు. "దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్" వంటి భావాలతో సమాజానికి విశాల దృక్పథాన్ని అందించారని పేర్కొన్నారు.గురుజాడ వారసులకు గతంలో నిలిచిపోయిన గౌరవ వేతనాన్ని ప్రభుత్వం పునరుద్ధరించిందని మంత్రి తెలిపారు. గురుజాడ ఆశయాలు, సాహిత్య సేవలను స్మరించుకుంటూ ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.

# గ్రూప్-1 పరీక్షల వివాదంపై హైకోర్టులో విచారణ



**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 21 :** ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల వివాదంపై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. సిట్ సమర్పించిన నివేదికలతో జత చేసిన డాక్యుమెంట్ల కాపీలను అప్పీల్‌దారులకు అందించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది.గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు.. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో పరీక్షకు సంబంధించిన వాస్తవాలను తేల్చేందుకు హైకోర్టు సీఐడీ డీజీ నేతృత్వంలోని సిట్‌తో విచారణ జరిపించింది. విచారణ పూర్తి చేసిన సిట్.. ప్రాథమిక, తుది నివేదికలను హైకోర్టుకు సమర్పించింది. అయితే ఈ నివేదికలతో జత చేసిన కీలక డాక్యుమెంట్లు తమకు అందించాలని కోరుతూ పలువురు అప్పీల్‌దారులు హైకోర్టులో అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై తాజాగా విచారణ జరిగింది.ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాది సీవీ రెడ్డి వాదనలు వినిపించారు. సిట్ సమర్పించిన ప్రాథమిక, తుది నివేదికల్లో వ్యత్యాసాలు ఉన్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సిట్ ఒక నిర్ధారణకు రావడానికి ఆధారమైన డాక్యుమెంట్లను తమకు అందించాలని కోరారు. అదే విధంగా న్యాయవాది మోహన్ రెడ్డి కూడా సిట్ అంచనాకు రావడానికి కారణమైన డాక్యుమెంట్ల కాపీలను ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. వాదనలు విన్న హైకోర్టు.. సిట్ నివేదికలతో జత చేసిన డాక్యుమెంట్ల కాపీలను అప్పీల్‌దారులకు వెంటనే అందజేయాలని రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌ను ఆదేశించింది.

# వైసీపీకి షాక్.. కీలక నేత రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ఆకర్షితుడినై జనసేనలో చేరానని పేర్కొన్నారు.జగన్ హయాంలో ఇళ్లస్థలాల పేరుతో కమీషన్లు కొట్టేశారు.ఈ సందర్భంగా సుబ్బారావు వైసీపీపై షాకింగ్ కామెంట్స్ చేశారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఇళ్ల స్థలాల పేరుతో కమీషన్లు కొట్టేశారని ఆరోపించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో పనికి రాని భూములను ఇళ్లస్థలాల కోసమంటూ అధిక ధరలకు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. నేటికి పలు స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు. ఇళ్ల స్థలాల విషయంలో జగన్ విధానం సరిగా లేదని సుబ్బారావు ధ్వజమెత్తారు.

# గురువులపై దాడి ఘటన.. ఏపీ ప్రభుత్వం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మూకుమ్మడి దాడులు, నిబంధనల ఉల్లంఘన, పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించడం వంటి అంశాలపై కేసులు నమోదు చేయనున్నారు. మాచవరం, సూర్యారావుపేట, కృష్ణలంక పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసుల నమోదు చేయాలని ఆదేశించింది. ర్యాలీ, ఘర్షణల్లో పాల్గొన్నట్లు గుర్తించిన రౌడీషీటర్లను వెంటనే అదుపులోకి తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. మచిలీపట్నం, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి నగరాల నుంచి కొంతమంది రౌడీషీటర్లు ఘటనలో పాల్గొన్నట్లు పోలీసులకు సమాచారం అందినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కొంతమంది రౌడీషీటర్లను పోలీసు అధికారులు గుర్తించినట్లు సమాచారం. వైసీపీ గ్యాంగ్‌లు కర్రలు, రాడ్లు, కోడిగుడ్లు, రాళ్లు తీసుకురావడం వెనుక పక్కా ప్లాన్ ఉందని పోలీస్ అధికారులు చెబుతున్న పరిస్థితి.

# ఏపీలో అతిభారీ వర్షాలు..

(మొదటి పేజీ తరువాయి)

అల్పపీడనం ఎల్లుండికి (బుధవారం) తీవ్రవాయుగుండంగా బలపడి దక్షిణ ఒడిశా – ఉత్తరాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందని హోం మంత్రి అనిత వెల్లడించారు. రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. ప్రభావిత జిల్లాల అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఒడిశాలో వర్షాలతో వంశధార, నాగావళి నదులు పొంగే అవకాశం ఉందని తెలిపారు. బోర్డర్ ఒడిశా జిల్లాల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సహాయక చర్యల కోసం SDRF, NDRF బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.**ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి..**అవసరమైతే తీరం వెంబడి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని హోం మంత్రి అనిత మార్గనిర్దేశం చేశారు. వాగులు, పొంగిపొర్లే కాజ్‌వేలు, ముంపు ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌లను 24 గంటల పాటు అందుబాటులో ఉంచి, పరిస్థితిని నిరంతరం సమీక్షించాలని అన్నారు. తీరం వెంబడి గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు. చెట్లు, భారీ హోర్డింగ్స్ , శిథిలావస్థలో ఉన్న ఇళ్ల వద్ద ఉండరాదని చెప్పారు. ప్రజలు.. ప్రభుత్వం జారీ చేసే వాతావరణ హెచ్చరికలను పాటించాలని... తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హోం మంత్రి అనిత సూచించారు.

# సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు షాక్

**న్యూఢిల్లీ :మన జనప్రగతి సెప్టెంబర్ 21**: కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు షాక్ ఇచ్చింది. 1983లో భారత పౌరసత్వం పొందేందుకు మూడేండ్ల ముందే సోనియా గాంధీ పేరును ఓటర్ల జాబితాలో చేర్చారన్న ఆరోపణపై విచారణకు నిరాకరిస్తూ గతంలో మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన రివిజన్ పిటిషన్‌ను అనుమతించింది. ఈ పిటిషన్ను తిరిగి విచారణ చేపట్టాలంటూ ఢిల్లీ కోర్టు సోమ వారం ఆదేశించింది. మేజిస్ట్రేట్ ఉత్తర్వును సరైన వివరణ లేనిదిగా పేర్కొంటూ ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే దానిని కొట్టివే శారు. రౌస్ అవెన్యూ కోర్టుల సెంట్రల్ ఢిల్లీ కోర్ట్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అడ్వకేట్ వికాస్ త్రిపాఠి ఈ పిటిషన్ను దాఖలు చేశారు."భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 175(3)ను పాటిం చకపోవడం, ముఖ్యంగా సంబంధిత పోలీస్ అధికారి వాదనలు వినకపోవడం, సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి స్టేటస్ రిపోర్ట్ తెప్పిం చకపోవడం వంటి కారణాల వల్ల సదరు ఉత్తర్వు లో చట్టపరంగా స్పష్టమైన లోపం ఉంది. చట్టం ప్రకారం ఉన్న రెండు మార్గాలను అంటే ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించడం లేదా ప్రత్యా మ్నాయంగా బీఎన్ఎస్ఎస్ కింద విచారణ జరపడం వంటి అంశాలను మేజిస్ట్రేట్ పరిగణ నలోకి తీసుకోనందున ఆ ఉత్తర్వులో ఎటువంటి వివరణా లేదని స్పష్టమవుతోంది." అని న్యాయమూర్తి అన్నారు.

# టీచర్లపై దాడులను ఉపేక్షించేది లేదు: మంత్రి సవిత

(మొదటి పేజీ తరువాయి)

వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడాన్ని సహించబోమని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మెగా డీఎస్సీ-2025లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలను మంత్రి ఖండించారు. స్పోర్ట్స్ కోటాతో పాటు ఇతర కోటాల్లోనూ నిబంధనల ప్రకారమే ఎంపికలు జరిగాయని, ఈ అంశంపై విద్యాశాఖ అధికారులు స్పష్టత ఇచ్చారని తెలిపారు. డీఎస్సీ నియామకాల్లో అభ్యర్థుల కష్టాన్ని తక్కువ చేసి చూపేలా ఆరోపణలు చేయడం సరికాదన్నారు.మెగా డీఎస్సీతో పాటు ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్-1 మూల్యాంకనంపై కూడా చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని మంత్రి సవిత తెలిపారు. సంబంధిత అంశాలపై వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు చర్చకు రావాలని వైసీపీ అధినేత జగన్‌కు సూచించారు. రాజకీయ విభేదాల పేరుతో కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని మంత్రి సూచించారు. దాడులు, అల్లర్లకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వర్గాలు సంయమనం పాటించాలని ఆమె కోరారు.

# టీచర్లపై వైసీపీ దాడి.. వదిలే ప్రసక్తే లేదంటూ మంత్రి లోకేశ్ వార్నింగ్

(మొదటి పేజీ తరువాయి)

స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు అంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని వ్యాఖ్యానించారు.జగన్ ఫేక్ ముఠా తప్పుడు నిందలతో అవమానాలు పాలైన స్పోర్ట్స్ కోటా డీఎస్సీ 2025 టీచర్లు తమకు న్యాయం చేయాలంటూ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని మంత్రి తెలిపారు. క్రీడలతో దేశ పతాకాన్ని రెపరెపలాడించి, ప్రతిభతో టీచర్ ఉద్యోగం సాధించిన స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ ఫ్యాక్షన్ ముఠా శాప్ కార్యాలయం వద్ద దాడికి దిగిందని మండిపడ్డారు. రౌడీ షీటర్లు, గంజాయి- బ్లేడ్ బ్యాచులను టీచర్లపైకి ఉసిగొల్పడం జగన్ నేర మనస్తత్వాన్ని బయటపెట్టిందని విమర్శించారు. పూజించాల్సిన గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేసిన జగన్ క్రిమినల్ గ్యాంగులను వదిలే ప్రసక్తి లేదన్నారు. టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలన్నారు. వైసీపీ ప్రేరేపిత రౌడీ షీటర్లు, గంజాయి-బ్లేడ్ బ్యాచుల పనిపడతామంటూ ఎక్స్‌లో లోకేశ్ పోస్ట్ చేశారు.

# తెలుగు సాహిత్యానికి గురజాడ అప్పారావు చేసిన సేవలు చిరస్మరణీయం

● జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 21:-**తెలుగు భాషా సాహిత్యానికి విశిష్ట సేవలందించి, వాడుక భాషకు ప్రాధాన్యత కల్పించడంతో పాటు తన రచనల ద్వారా సామాజిక చైతన్యాన్ని పెంపొందించిన మహాకవి గురజాడ అప్పారావు సేవలు చిరస్మరణీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. మహాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పర్యాటక శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, అధికారులు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గురజాడ అప్పారావు 1862 సెప్టెంబర్ 21న జన్మించారన్నారు. తెలుగు సాహిత్యంలో వాడుక భాషను ప్రవేశపెట్టి, సాహిత్యాన్ని సామాన్య ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఆయన విశేష కృషి చేశారన్నారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యే భాషలో రచనలు చేస్తూ సామాజిక సమస్యలు, మానవతా విలువలు, సమాజ సంస్కరణ వంటి అంశాలను తన సాహిత్యంలో ప్రతిబింబించారన్నారు. గురజాడ అప్పారావు రచించిన 'కన్యాశుల్కం' తెలుగు నాటక సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకుందన్నారు. 'దేశమును ప్రేమించుమన్నా' వంటి రచనలు ప్రజల్లో దేశభక్తి, సమాజం పట్ల బాధ్యతాభావాన్ని పెంపొందించడంలో విశేష ప్రభావం చూపాయన్నారు. ఆయన సాహిత్యం నేటికీ ప్రజలను ఆలోచింపజేసే విధంగా నిలిచిందని, తెలుగు భాషా సాహిత్యానికి ఆయన అందించిన సేవలను స్మరించుకోవడంతో పాటు, ఆయన రచనల్లోని సామాజిక సందేశాలను ఆచరించాల్సిన అవసరం ఉందని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, శివ ప్రసాద్ రెడ్డి, సీపీవో భారతి, డీఈవో జి. సుధాకర్ , సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ లోకరాజు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధికా, నైపుణ్యాభివృద్ధి అధికారి దీప్తి, డి.ఎస్.డి.వో భూపతి రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని మహాకవి గురజాడ అప్పారావుకు ఘనంగా నివాళులర్పించారు.

# మాధవరం-1లో ఘనంగా వినాయకుని ఊరేగింపు

- ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలి: సీఐ వెంకటేశ్వర్లు



**సిద్దవటం మన జనప్రగతి సెప్టెంబరు 21:-**వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మాధవరం-1 గ్రామంలో ఏడవ రోజు ఆదివారం గణనాథుని ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు, సిద్ధవటం ఎస్ఐ హారిక కార్యక్రమానికి హాజరై గణనాథుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు అధికారులకు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేసి, స్వామివారి కండువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా యువత సంయమనం పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఊరేగింపు నిర్వహించుకోవాలని సూచించారు. భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథుని ఊరేగింపులో యువకులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు.

# అచ్యుత్ విండోస్ అండ్ ఇంటీరియర్స్ అందుబాటులోకి ఆధునిక డిజైన్లతో విండోస్,ఇంటీరియర్ పనులు

- కడప ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 21:-**కడప నగరంలోని జిల్లా పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్‌లో అచ్యుత్ విండోస్ అండ్ ఇంటీరియర్స్ నూతన కార్యాలయం సోమవారం ప్రారంభమైంది. చింతకొమ్మదిన్నె మండలం యు.గోపులాపురం మాజీ సర్పంచ్, సంస్థ ప్రొప్రైటర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పుత్తా నరసింహారెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ గృహాలు, భవనాలకు అవసరమైన నాణ్యమైన విండోస్, ఇంటీరియర్ పనులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కడప ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.కస్టమర్ల అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా వివిధ రకాల డిజైన్లను తయారు చేసి అందించనున్నట్లు తెలిపారు. వినియోగదారులు తమకు నచ్చిన డిజైన్‌ను ఆర్డర్ మేరకు తయారు చేయించుకోవచ్చని పేర్కొన్నారు. కడప నగర ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఆధునిక ఇంటీరియర్ పనులను అందించేందుకు సంస్థ కృషి చేస్తుందని, ప్రజలు తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గంధం మోహన్‌బాబు, కృష్ణారెడ్డి, పీర్ ప్రసాద్, తాడిగొట్ల శ్రీనివాసులు, ఓబుల్‌రెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్యతో పాటు మండల నాయకులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు పరిష్కారాలు అందించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.



**కర్నూలు మన జనప్రగతి సెప్టెంబర్ 21:-**ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు పరిష్కారాలను అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను జాయింట్ కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. పిటిషనర్లకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించడం సాధ్యం కాని పరిస్థితుల్లో, కారణాలను పూర్తిగా వివరించి పిటిషనర్లకు అవగాహన కల్పించాలని జేసీ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదు అందిన వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవ పరిస్థితులను తెలుసుకొని సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోని, ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు.పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న "రీ ఓపెన్" మరియు "ఇంప్రాపర్ రెడ్రెసల్" కేసుల శాతాన్ని పూర్తిగా తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామసుబ్బయ్య, అనురాధ, శివప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరువును రాష్ట్ర విపత్తుగా గుర్తించాలి

● రాష్ట్రానికి రూ.వెయ్యి కోట్ల పరిహారం ఇవ్వాలి



**దేవనకొండ మన జనప్రగతి సెప్టెంబర్ 21:-**రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న తీవ్ర కరువును రాష్ట్ర విపత్తుగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్ల పరిహారం ప్రకటించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కే. లోకనాథం డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కరువు పరిశీలనలో భాగంగా కర్నూలు జిల్లాలోని ఈదులదేవరబండ, కప్పట్రాళ్ల గ్రామాల్లో పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో లోకనాథం మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. గతంలో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకే పరిమితమైన కరువు పరిస్థితులు ఈ ఏడాది రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. సరైన సాగునీటి వనరులు లేకపోవడంతో కోస్తా ప్రాంతాల్లోనూ కరువు ఛాయలు అలుముకున్నాయని అన్నారు.కరువు కారణంగా ప్రజల ఆర్థిక పరిస్థితులు, ఉపాధి అవకాశాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని తెలిపారు. తాగునీరు, సాగునీరు, పశుగ్రాసం, ఆహార ధాన్యాల సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ పనులను పెంచి అదనపు పని దినాలు కల్పించాలని, చేసిన పనులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని, బియ్యం, చక్కెర, పప్పులు, వంటనూనె ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని, వ్యవసాయం, ఉద్యానవనం, పట్టు పరిశ్రమలకు పెద్ద ఎత్తున రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా అమలు చేయడంతో పాటు రానున్న సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను ఉచితంగా అందించాలని కోరారు.సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాధాకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడం వల్లే కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. హంద్రీనీవా ద్వారా చివరి ఆయకట్టుకు నీరు అందిస్తామని చెబుతున్న ప్రభుత్వం జిల్లాలో ఎన్ని ఎకరాలకు నీరు అందించిందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. అందుబాటులో ఉన్న సాగునీటిని పూర్తిస్థాయిలో వినియోగించి రైతులకు నీరు అందించాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేవీ నారాయణ, అంజిబాబు, ఆనందబాబు, బజారి, కేపీ రాముడు, శ్రీనివాసులు, సూరి, వీరేంద్రనాయుడు, రవీంద్ర, లింగన్న, మార్కండేయులు, నజీర్ అహ్మద్, లతీఫ్ తదితరులు, కప్పట్రాళ్ల గ్రామ రైతులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసేలా పటిష్ట చర్యలు

**1,700 మంది పోలీసులతో భారీ బందోబస్తు**

**రేపు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు**





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 21:-**కర్నూలు నగరంలో మంగళవారం నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. నిమజ్జన బందోబస్తు విధులకు హాజరైన పోలీసు అధికారులు, సిబ్బందికి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయ పరేడ్ మైదానంలో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ దిశానిర్దేశం చేశారు.గణేష్ శోభాయాత్ర జరిగే మార్గాలు, ప్రధాన కూడళ్లు, నిమజ్జన ఘాట్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.నిమజ్జన ఘాట్ల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు తమకు కేటాయించిన ప్రాంతాల్లోనే విధులు నిర్వహించాలని ఎస్పీ స్పష్టం చేశారు. విధుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదన్నారు. పోలీసులు అత్యుత్సాహానికి పోకుండా సంయమనంతో వ్యవహరిస్తూ భక్తులు, ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.గణేష్ నిమజ్జనం సందర్భంగా నగరంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా మంగళవారం ప్రత్యేక ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. మొత్తం 1,700 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో నంద్యాల ఏఎస్పీ సుస్మిత, అదనపు ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సివిల్, ఏఆర్, ఏపీఎస్పీ, స్పెషల్ పార్టీ, హోంగార్డు సిబ్బందితో పాటు కర్నూలు, నంద్యాల, కడప, అనంతపురం జిల్లాలకు చెందిన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మిట్టమల్లేశ్వరునికి విశేష పూజలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 21:-** పులివెందుల పట్టణంలోని గుంత బజార్ సమీపంలో గల ప్రసిద్ధ పురాతన శ్రీ మిట్టమల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సందర్భంగా విశేష పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రధాన అర్చకులు రుద్ర,శివ స్వాముల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, భస్మాభిషేకం,సహస్రనామ అష్టోత్తర శతనామావళి, లింగాష్టక పఠనం తదితర పూజా కైంకర్యాలు జరిపారు. అనంతరం మిట్టమల్లేశ్వరుడు భక్తులకు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ, ఆలయంలో ప్రతిరోజూ నిత్య ధూప,దీప,నైవేద్యాలు ఘనంగా కొనసాగుతున్నాయని తెలిపారు.సోమవారం కావడంతో పట్టణ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు,ఆలయ కమిటీ సభ్యులు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
22 - 09 - 2026

## మౌలిక సదుపాయాల సమస్యలను 24 గంటల్లో పరిష్కరించాలి: మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం, మన జనప్రగతి సెప్టెంబర్ 21:** తాగునీరు, సాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. మచిలీపట్నంలోని తోటవారితుళ్ల సెంటర్‌లో రోడ్డుపై మురుగు ప్రవహిస్తోందని ప్రజలు ఫిర్యాదు చేయడంతో మంత్రి స్వయంగా అక్కడికి వెళ్లి సమస్యను పరిశీలించారు. మురుగు కాలువల్లో పూడిక తొలగించే పనుల్లో పాల్గొని, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు వచ్చినా 24 గంటల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నిర్లక్ష్యం వహించినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వినాయకుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం



**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబర్ 21:**-రాయచోటి పట్టణంలోని స్టేట్ బ్యాంక్ సమీపంలోని మోర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద భక్తుల కోసం నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ తరఫున రూ.1 లక్ష విరాళాన్ని అందజేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఈ విరాళాన్ని వినాయక విగ్రహ కమిటీ సభ్యులకు అందజేశారు. భక్తుల కోసం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి సహకారంగా ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. వినాయక విగ్రహ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



**ఒంటిమిట్ట మన జనప్రగతి సెప్టెంబరు 21:**-మెగా డీఎస్సీపై పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై, స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మాజీ డైరెక్టర్, ఒంటిమిట్ట మండల టీడీపీ సీనియర్ నాయకుడు కొమర వెంకట నరసయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులు అర్హత కలిగిన క్రీడా ధ్రువపత్రాలతోనే మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. తమ సర్టిఫికెట్లను బహిరంగంగా ప్రదర్శిస్తూ నిరసన చేపడుతున్న వారిపై దాడులు చేయించడం సరికాదన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు వైఎస్సార్‌సీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నారని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులకు ప్రభుత్వం భరోసా కల్పించడాన్ని ఆయన స్వాగతించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 14 డీఎస్సీలలో తొమ్మిది డీఎస్సీల ద్వారా టీడీపీ ప్రభుత్వాలు సుమారు రెండు లక్షల మంది అర్హులైన నిరుద్యోగులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించాయని తెలిపారు. గత ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ అమలులో విఫలమైందని విమర్శించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## శ్రీరాములుపేటలో వైద్య శిబిరం..

- దీర్ఘకాలిక వ్యాధులపై ప్రత్యేక పరీక్షలు
- గర్భిణులు,బాలింతలకు ఆరోగ్య అవగాహన..
- కుష్టు వ్యాధి గుర్తింపునకు స్క్రీనింగ్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 21:**-చాపాడు మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్ద గురువలూరు సచివాలయం పరిధి శ్రీరాములుపేట గ్రామంలో డాక్టర్ పి. ఓబులేసు ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవా సంకల్ప అభియాన్' వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ విషయాన్ని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి. ఓబులేసు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వైద్య శిబిరంలో గర్భిణులు,బాలింతలు,మధుమేహం,రక్తపోటు, ఈ రెండు వ్యాధులతో బాధపడుతున్నవారు, బ్రెయిన్ స్ట్రోక్ చరిత్ర కలిగినవారు, గుండె సంబంధిత వ్యాధులున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు, చికిత్స అందించినట్లు తెలిపారు. కుష్టు వ్యాధి అనుమానిత కేసులను గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. గర్భిణులు, ఇతర రోగులకు పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి, వ్యాధుల నియంత్రణ, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించినట్లు వివరించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడం, దీర్ఘకాలిక వ్యాధులను ముందస్తుగా గుర్తించి నియంత్రించడం, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు డాక్టర్ ఓబులేసు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య,సూపర్‌వైజర్ ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ నీలావతి, ఏఎన్ఎం శశిరాణి, ఆశా కార్యకర్తలు పెద్ద ఓబులమ్మ, గౌరీదేవి, 104 వాహన సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**మదనపల్లి,మన జనప్రగతి సెప్టెంబర్ 21 :-** పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా వచ్చే అర్జీలను ఎలాంటి పెండింగ్ లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రీవెన్స్‌పై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని, సమస్యల పరిష్కారంలో అలసత్వం ఉండకూడదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి సానుకూల అభిప్రాయాలు వచ్చేలా అధికారులు పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 467 అర్జీలు అందాయి. వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో ఏ. వెంకటేష్, కేఆర్ఆర్సీ ఎస్‌డీసీ చంద్రశేఖర్ రెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్‌డీసీ మాధవ కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 15 రోజులుగా తాగునీటికి తిప్పలు


**- ఖాళీ బిందెలతో మహిళల నిరసన**



**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబరు 21:**-మండలంలోని చలమారెడ్డిపల్లె కొట్టాలు గ్రామం బీసీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 65 కుటుంబాలు నివసిస్తున్న ఈ ప్రాంతంలో గత 15 రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కొండ ప్రాంతంలో నివసిస్తున్న తమకు తాగునీరు అందక, సమీపంలోని మరో గ్రామానికి వెళ్లి పొలాల్లో నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో మెహతాబ్ యాస్మిన్‌ను వివరణ కోరగా, చలమారెడ్డిపల్లె కొట్టాలు గ్రామానికి వెళ్లే తాగునీటి పైపులైన్ దెబ్బతినడంతో సమస్య ఏర్పడిందన్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కర్నూలు న్యాయవాదులు





**కర్నూలు బ్యూరో/అమరావతి మన జనప్రగతి సెప్టెంబర్ 21:**-కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కర్నూలు న్యాయవాదులు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాదులతో కలిసి సోమవారం అమరావతిలోని హైకోర్టులో ఏపీ ప్రధాన న్యాయమూర్తి ని గౌరవప్రదంగా కలిశారు. కర్నూల్ లో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు విషయంపై కర్నూలు జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ సురేష్ రెడ్డిని, మరియు ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రధాన న్యాయమూర్తి చాలా సానుకూలంగా స్పందించి, వినతిపత్రంలో ప్రస్తావించిన విషయానికి సంబంధించి వీలైనంత త్వరగా తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చంద్రుడు, కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు ఎ. రామ సుబ్బారెడ్డి, సి. నాగేంద్రనాథ్, వై. జయరాజు, చంద్ బాషా, కపిలేశ్వరయ్య, జోగయ్య శర్మ, ఓంకార్, కోశాధికారి సుమనా రాణి మరియు ఇతర సహచర న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**• సమస్యలు లేని నియోజకవర్గంగా పీలేరును తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి**



**పీలేరు మన జనప్రగతి సెప్టెంబర్ 21:**-పీలేరు నియోజకవర్గాన్ని సమస్యలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. కలికిరి మండలం నగిరిపల్లిలోని తన కార్యాలయంలో సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు తెలిపిన సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ పెండింగ్ సమస్యలు, పీలేరు, కలికిరి, కలకడ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు, రోడ్ల మరమ్మతులు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం పథకంలో అర్హుల పేర్ల చేర్పు వంటి సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే రెవెన్యూ సమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాలు, భూ సర్వే, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్ల కొరత తదితర సమస్యలను ప్రజలు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎక్కడా రాజీపడబోమని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడికి ప్రత్యేక పూజలు

**• అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సుగవాసి ప్రసాద్ బాబు**



**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబర్ 21:**-వినాయక వారోత్సవాల్లో భాగంగా రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డు కొత్త పోలీసుస్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విఘ్నేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చెన్నూరు వెంకట సుబ్బారాయుడు, సుబ్బమ్మ దంపతులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సుగవాసి ప్రసాద్ బాబును ఘనంగా సత్కరించారు. అన్నదానం గొప్ప పుణ్యకార్యమని పేర్కొన్న ఆయన, భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలను నిర్వహిస్తూ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. విఘ్నేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సమృద్ధులతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

## ఉపాధ్యాయులపై దాడులు వైసీపీ అరాచకానికి పరాకాష్ట

**డీఎస్సీపై ఆరోపణలు తప్ప ఆధారాలు చూపలేకపోతున్నారు**

**డీఎస్సీ గురించి మాట్లాడే కనీస అర్హత వైసీపీకి లేదని మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా**



**అమరావతి మన జనప్రగతి సెప్టెంబర్ 21:-** అధికారంలో ఉన్న ఐదేళ్లు మెగా డీఎస్సీ పేరుతో యువతను దగా చేసిన జగన్ రెడ్డి.. ఇప్పుడు ఉపాధ్యాయులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడడం దుర్మార్గమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రికొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీని అత్యంత పారదర్శకంగా పూర్తి చేసింది. అలాంటి డీఎస్సీపై వైసీపీ నాయకులు లేనిపోని ఆరోపణలుచేస్తూ, ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ దాడులకు తెగబడుతున్నారు. శాప్ కార్యాలయం ముట్టడి పేరుతో ఉపాధ్యాయులపై రాళ్లు, రాడ్లు, వాటర్ బాటిల్లతో దాడికి తెగబడ్డారు. శాప్ కార్యాలయంపై మూకుమ్మడి దాడికి తెడబడి వైసీపీ నాయకుల పైశాచికత్వాన్ని చాటుకున్నారు. కూటమి ప్రభుత్వం క్రీడాకారుల్ని ప్రోత్సహిస్తూ.. వారిని జాతీయ అంతర్జాతీయ క్రీడా పోటీలకు సిద్ధమయ్యేలా ప్రోత్సహిస్తుంటే.. జగన్ రెడ్డి మాత్రం క్రీడాకారుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. జగన్ రెడ్డి ఇప్పటికైనా డీఎస్సీపై అభాండాలు, ఆరోపణలు చేయడం మానుకోవాలి. అలా కాకుండా.. ఉపాధ్యాయుల ఆత్మగౌరవంతో ఆడుకుంటాం, దాడులు చేస్తామంటే తగిన చర్యలు తప్పవని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## మరమ్మతుకు నోచుకోని చేతిపంపు బోరు

**- తాగునీటికి అవస్థలు పడుతున్న ఎస్సీ కాలనీ వాసులు**



**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబర్ 21:**-మండలంలోని చలమారెడ్డి కొట్టాల గ్రామంలో చేతిపంపు బోరు పనిచేయక ఎస్సీ కాలనీ వాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు సోమవారం మాట్లాడుతూ, తమ కాలనీలో నివాసం ఉంటున్న 30 కుటుంబాలకు గత 2 నెలలుగా చేతిపంపు బోరు చెడిపోవడంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామని వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని మరమ్మతులు చేయాలని కోరారు. ఈ విషయమై సిద్ధవటం ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గురుప్రసాద్ వివరణ కోరగా, చలమారెడ్డి కొట్టాల గ్రామంలో చేతిపంపు బోరు చెడిపోయినట్లు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, త్వరలోనే ఆ ప్రాంతాన్ని పరిశీలించి మరమ్మతులు చేపడతామని తెలిపారు.

మనజనప్రగతి

22 - 09 - 2026

# నగరపాలక సంస్థకు 40 వినతులు: కమిషనర్ ఎం.జయకృష్ణ



**తిరుపతి మన జనప్రగతి సెప్టెంబర్ 21:–** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 40 వినతులు వచ్చాయని కమిషనర్ ఎం.జయకృష్ణ తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా ఆరు మంది, కార్యాలయంకు నేరుగా వచ్చి 34 మంది వినతులు సమర్పించి తమ సమస్యలు తెలిపారు. కొర్లగుంట మారుతీ నగర్ లో కలుషితమైన తెలుగు గంగ నీరు వస్తున్నాయి తగుచర్యలు చేపట్టాలని, ఖాదీ కాలనిలో రోడ్లపైన ఉన్న గుంతలు పూడ్చాలని, సప్తగిరి నగర్ నందు డ్రైనేజి కాలువలు సరిగా లేకపోవడంతో మురుగునీరు ఇండ్లలోనికి వస్తున్నాయి పరిశీలించాలని, గరుడాద్రి నగర్ నందు మురుగునీరు రోడ్లపై వస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతూ, అనారోగ్యం పాలవుతున్నాము తగు చర్యలు తీసుకోవాలని, అంధుల శరణాలయం వద్ద కుక్కలు, దోమల బెడద ఎక్కువగా ఉందని, పట్నూల్ వీధి మెయిన్ రోడ్డుకు సిసి రోడ్డు వేయాలని, ఎస్.కె.డి. నగర్ లో నిర్వహిస్తున్న హాస్టల్ వారు వ్యర్థాలు కాలువలో వేయడం వలన దుర్వాసన ఎక్కువగా ఉందని, వరదరాజ నగర్ లో 60అడుగుల రోడ్డు అన్యాక్రాంతం అవుతున్నది పరిశీలించాలని, ఇంటి పన్నులో తన పేరు రామమూర్తిగా మార్చాలని కోరారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను ఆయా విభాగాల అధికారులకు పంపి చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. రామమూర్తి అనే 10 ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశానని ఫలితాలు బాగున్నాయని తెలుపగా కమిషనర్ ఆయన్ను అభినందించారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు అందరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, సర్వేయర్ గురువా రెడ్డి, మేనేజర్ హాసీమ్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# లెక్కలవారిపల్లె పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు

- 9 మంది విద్యార్థులకు తగ్గిన కంటి చూపు గుర్తింపు..
- ఉచితంగా కంటి అద్దాల పంపిణీ..!



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 21:–** జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో లెక్కలవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. నరసింహులు ఆధ్వర్యంలో ఆఫ్తాల్మిక్ అధికారి ఎస్.వినోద్,ఏఎన్ఎం సుజాత ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలోని 150 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా,తొమ్మిది మందికి కంటి చూపు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఎంపికైన విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా ఉచితంగా కంటి అద్దాలు అందజేయనున్నట్లు ఆఫ్తాల్మిక్ అధికారి ఎస్. వినోద్ తెలిపారు.ప్రధానోపాధ్యాయులు కె.నరసింహులు మాట్లాడుతూ విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి కంటి పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం లేకుండా పాఠశాల వద్దకే వచ్చి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కంటి చూపు సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి ఉచితంగా అద్దాలు అందించడం వల్ల వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. రాజశేఖర్ రెడ్డి, సి.మహమ్మద్ సాదిక్,రామిరెడ్డి,ఎం. అరుణ,ఓ.రమాదేవి, చంద్రకళ, లక్ష్మీదేవి,శ్రీనివాస్,గజ్జల వెంకటేశ్వర రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మాల కార్పొరేషన్‌కు అభివృద్ధి నిధులు విడుదల చేయాలి

- రెండేళ్లు పూర్తవుతున్నా నిధుల కేటాయింపులో జాప్యం ఎందుకు..?
- మాలలకు రాజ్యాంగ ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



**ఓబులవారిపల్లి మన జనప్రగతి సెప్టెంబర్ 21:–** మాల కార్పొరేషన్ అభివృద్ధికి సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేసి, మాలల సంక్షేమానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షులు పాలమనేని మల్లికార్జున డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్నా మాల కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపులో జాప్యం జరుగుతోందని ఆయన ప్రశ్నించారు.మాలల అభివృద్ధి, సంక్షేమానికి కేటాయించాల్సిన నిధులను ప్రభుత్వం సకాలంలో విడుదల చేయాలని మల్లికార్జున కోరారు. రాష్ట్రంలో మాలలకు తగిన ప్రాధాన్యం కల్పించకుండా వివక్ష చూపుతున్నారనే భావన నెలకొన్నదని పేర్కొన్నారు. మాలల అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రభుత్వం పునరాలోచించి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్రంలో మాలల జనాభా ఎక్కువగా ఉన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించి, వారికి రావాల్సిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, ఫలాలు ప్రతి ఒక్కరికీ సమానంగా అందేలా ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు.మాల కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి, మాలల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి మాలలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మల్లికార్జున విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గాజుల శ్రీనివాసులు, ప్రతిపక్ష నాయకులు, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 1098, 112 టోల్‌ఫ్రీ నంబర్లపై మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన

- బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన
- బాలల రక్షణకు సంబంధించి సమాచారం ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలి



**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబర్ 21:–** మహిళా సమాఖ్య సభ్యులకు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, అత్యవసర సేవల టోల్‌ఫ్రీ నంబర్ 112పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మిషన్ వాత్సల్య జిల్లా శిశు సంక్షేమం, సాధికారత, జిల్లా బాలల రక్షణ విభాగం చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బాలల రక్షణకు సంబంధించిన అంశాలపై మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా బాల్య వివాహాల నివారణ, దత్తత ప్రక్రియ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర అంశాలను వివరించారు. బాలలు ఎలాంటి ఇబ్బందులకు గురైనా, వారి రక్షణకు సంబంధించి సమాచారం తెలిసినా వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా 112 అత్యవసర నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది పి. రోహిత, ఎన్. ఇర్షాద్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బాలల హక్కులు, రక్షణపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య సభ్యులతో పాటు ఏబీపీఎం శ్రీనివాసులు, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడాకారులపై నిరాధార ఆరోపణలు చేయొద్దు

- డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయ అభ్యర్థుల ఆవేదన
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేత



**అన్నమయ్య బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 21:–** డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన తమపై నిరాధార ఆరోపణలు చేయొద్దని స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయ అభ్యర్థులు కోరారు. తమ క్రీడా సర్టిఫికెట్లను నకిలీవిగా చిత్రీకరిస్తూ కొన్ని రాజకీయ పార్టీలు, టీవీ చానళ్లు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన 372 మంది అభ్యర్థులు తాము క్రీడల్లో ప్రతిభ కనబరిచి, టెట్‌లో అర్హత సాధించి, ప్రభుత్వ నియామక ప్రక్రియ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందామని తెలిపారు. తమ అర్హతలు, సర్టిఫికెట్ల వాస్తవాలను తెలుసుకోకుండా తమను నేరస్తులుగా చిత్రీకరించడం వల్ల తాము, తమ కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక వేదనతో పాటు సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో విజయవాడలోని శాప్ కార్యాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమపై నిరాధార ఆరోపణలు చేస్తూ వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తులు, సంస్థలు, సామాజిక మాధ్యమాలపై సమగ్ర విచారణ జరిపించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. తమకు న్యాయం చేసి, వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవి నాయుడు, ఖాదీ బోర్డు చైర్మన్ కేకే చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి రహిత కాకినాడ లక్ష్యంగా 'సివైఎఫ్' ఆవిర్భావం

- యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి




**కాకినాడ మన జనప్రగతి సెప్టెంబర్ 21:–** యువతను సన్మార్గంలో నడిపించి, నగరంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల మహమ్మారిని సమూలంగా నిర్మూలించాలనే సంకల్పంతో 'కోస్టల్ యూత్ ఫోర్స్' (సివైఎఫ్) అనే నూతన వేదిక ఆవిర్భవించింది. కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని ఓ ఫంక్షన్ హాల్లో "హౌ టు లివ్ ఏ హెల్దీ లైఫ్" పేరిట ప్రత్యేక అవగాహన సదస్సు ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ వేదికగా గంజాయి నిర్మూలనే ధ్యేయంగా 'కోస్టల్ యూత్ ఫోర్స్'ను అధికారికంగా ప్రారంభించారు.తూరంగి మాజీ సర్పంచ్, సివైఎఫ్ గౌరవ అధ్యక్షుడు బలగం ప్రసన్నకుమార్, యువ నాయకులు అడ్డూరి హవ్యక్త, అడ్డూరి అభిషేక్'ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాకినాడ సిటీ, రూరల్ పరిసర ప్రాంతాల నుంచి యువత పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు బలగం ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కాకినాడలో ఒకప్పుడు చాలా ప్రశాంతంగా ఉండేదని ప్రస్తుతం యువత మాదకద్రవ్యాల అలవాట్లు చేసుకుని జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. తిరిగి ప్రశాంత కాకినాడగా తీసుకొచ్చేందుకు సివైఎఫ్ యువత పనిచేస్తుందన్నారు. గంజాయి ఇతర మాధక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాష్ట్రంలో అన్నిచోట్ల ప్రచారాలు చేస్తామని చెప్పారు. నాయకులు పాలెపు రవికుమార్, నాటి వినయ్, గరికిన వినయ్ తేజ, చెక్కా విష్ణు, అర్జున్, జేమ్స్ తదితరులు మాట్లాడుతూ ఒకప్పుడు రాష్ట్రంలోనే అత్యంత సురక్షితమైన నగరంగా, 'పెన్షనర్స్ ప్యారడైజ్'గా గుర్తింపు పొందిన కాకినాడలో నేడు గంజాయి, డ్రగ్స్ వినియోగం విపరీతంగా పెరిగిపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. మత్తు పదార్థాల ప్రభావంతో యుక్త వయసు వారు పెడదోవ పట్టి హత్యలు, చైన్ స్నాచింగ్‌లు వంటి తీవ్ర నేరాలకు పాల్పడుతున్నారని, దీంతో నగరంలో నేరాల రేటు పెరిగి ప్రజల్లో అభద్రతా భావం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చిన్నపాటి కారణాలకే టీనేజర్లు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమని, ఒత్తిడిలో ఉన్నవారిని సకాలంలో గుర్తించి కౌన్సెలింగ్ అందించాల్సిన బాధ్యత స్నేహితులు, సమాజంపై ఉందని పేర్కొన్నారు.ఈ పరిస్థితుల్లో మార్పు తీసుకొచ్చేందుకు 'కోస్టల్ యూత్ ఫోర్స్' వేదిక ద్వారా నగరంలోని ప్రతి వార్డులోనూ పర్యటించి మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు. యువతంతా ఐక్యంగా పోరాడి కాకినాడను తిరిగి పూర్వపు ప్రశాంతమైన, సురక్షితమైన, గంజాయి రహిత నగరంగా మార్చేందుకు నిరంతరం కృషి చేస్తామని వారు పునరుద్ఘాటించారు. అనంతరం సివైఎఫ్ లోగోను ఆవిష్కరించారు..

# సెకండ్ అడిషనల్ జడ్జిని కలసిన న్యాయవాదులు



**ఆదోని మన జనప్రగతి సెప్టెంబర్ 21:–** కాకినాడ కు బదిలీ పై వెళుతున్న ఆదోని సెకండ్ అడిషనల్ జడ్జి సాయి శ్రీ వల్లీ ని ఆదోని న్యాయ వాదులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఆదోని నుండి బదిలీ పై కాకినాడ కు వెళ్లుతున్న సందర్భంగా జూనియర్ న్యాయవాదులు కలిసి చిన్న జ్ఞాపిక అందజేశారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మల్లి, మధు, విష్ణు, ఖలందర్, శివ , హుస్సేన్ సాని, వసీమ్, ఇతర న్యాయవాదులు కలిసి వీడ్కోలు పలికారు.

# అనుమతులు లేని మట్టి తవ్వకాలు నిలుపుదల చేస్తాం




**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబరు 21:–** మండలంలోని పెద్దపల్లి రెవెన్యూ పరిధిలో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 1040లో గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల కోసం మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందినట్లు ఆయన పేర్కొన్నారు. హైవే రోడ్డు పనులకు మట్టి తవ్వకాల కోసం సర్వే నంబర్లు 1163, 1165లో మాత్రమే అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. అనుమతులు లేని ప్రాంతాల్లో జరుగుతున్న మట్టి తవ్వకాలను పరిశీలించి నిలుపుదల చర్యలు చేపడతామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

# ఆరో రోజుకు చేరిన వీఆర్‌ఏల నిరసన సమ్మె




**బొమ్మనహల్ మన జనప్రగతి సెప్టెంబర్ 21:–** గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏలు) చేపట్టిన నిరసన సమ్మె సోమవారం ఆరో రోజుకు చేరుకుంది,బొమ్మనహల్ మండల కేంద్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు వీఆర్‌ఏలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు, అనంతరం మండల అద్యక్షుడు మారుతి మాట్లాడుతూ..తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు,ఇందులో వీఆర్‌ఏలకు పే స్కేలు ప్రకారం రూ.21 వేల వేతనం చెల్లించాలని, నామినీలుగా పనిచేస్తున్న వీఆర్‌ఏలను పర్మినెంట్ చేయాలని,అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు కల్పించాలని, అదనపు విధుల నుంచి విముక్తి కల్పించాలని కోరారు,ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు,ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు మారుతి,అరుణ, చంద్రహాసన్,దుర్గేష్,బసయ్య, రామకృష్ణ,పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్దేహాల్‌లో ఆల్జీమర్స్‌పై ప్రజలకు అవగాహన



**బొమ్మనహల్ మన జనప్రగతి సెప్టెంబర్ 21:–** మండల పరిధిలో ఉద్దేహాల్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో జాతీయ ఆల్జీమర్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, వైద్యాధికారి మాట్లాడుతూ..ఆల్జీమర్స్ వల్ల జ్ఞాపకశక్తి, ఆలోచనా శక్తి క్రమంగా తగ్గుతాయని,వయసు పెరిగే కొద్దీ ఈ సమస్య ఎక్కువగా కనిపించే అవకాశం ఉందని వివరించారు,జ్ఞాపకశక్తి కోల్పోవడం,రోజువారీ పనులు చేయడంలో ఇబ్బంది,తెలిసిన ప్రదేశాల్లో దారి మర్చిపోవడం, ప్రవర్తనలో మార్పులు వంటి లక్షణాలపై అవగాహన కల్పించారు,ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నాగమణి, ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్,ఆశా కార్యకర్తలు ఈరమ్మ,లక్ష్మి, హరిత,ప్రజలు పాల్గొన్నారు.

# మెడికవర్ హాస్పిటల్స్‌లో నూతన క్యాన్సర్ విభాగం ప్రారంభం





**కాకినాడ మన జనప్రగతి సెప్టెంబర్ 21**:-కాకినాడ ఏడిబి రోడ్లో ఉన్న మెడికవర్ హాస్పిటల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ విభాగాన్ని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలకు అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలను అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, జనసేన నాయకులు దుగ్గన బాబ్జీ ఈ విభాగాన్ని సందర్శించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.క్యాన్సర్ నిర్ధారణ నుంచి చికిత్స వరకు మెడికల్, సర్జికల్, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల సమన్వయంతో సమగ్ర వైద్యం అందిస్తామని సెంటర్ హెడ్ ఎన్ అంజిబాబు తెలిపారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకోవాలని ఆసుపత్రి వైద్యులు డా. మురళీధర్, డా. పృధ్వీ రాజ్, డా. ప్రదీప్ భాస్కర్, డా. సమంత్ కుమార్, డా. శివ భరత్ సూచించారు. ఈ విభాగం తో కాకినాడ సహా పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం చేరువకానుంది. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నగరిగుట్టలో సమస్యల పరిష్కారానికి వైఎస్ మనోహర్ రెడ్డి చొరవ

- తాగునీరు,డ్రైనేజీ సమస్యలపై స్థానికుల వినతి
- వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 21**:- పట్టణ పరిధిలోని నగరిగుట్ట తదితర ప్రాంతాల్లో నెలకొన్న తాగునీరు,డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి వైఎస్ మనోహర్ రెడ్డి చొరవ చూపారు.స్థానిక ప్రజలు,మహిళలు తమ ప్రాంతంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి పరిష్కార దిశగా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ తమ ప్రాంతంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులు, చెత్త సేకరణ వాహనాలు క్రమం తప్పకుండా రావడం లేదని ఫిర్యాదు చేశారు. ప్రజల సమస్యలను ఓపికగా విన్న మనోహర్ రెడ్డి వెంటనే మునిసిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.ప్రజల ప్రాథమిక అవసరాలైన తాగునీరు,పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదని,సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి,మాజీ మునిసిపల్ చైర్మన్ హాఫీజ్,పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్,నాయకులు కొంగనపల్లి రవికుమార్, భాషా,చల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ కుమార్ రాజా



**బొమ్మనహాల్ మన జనప్రగతి సెప్టెంబర్ 21**:-మండల పరిధిలో లింగదహాల్ గ్రామంలో శ్రీధరగట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ కుమార్ రాజా ఆధ్వర్యంలో చంద్రన్న సంచార వైద్యశాల కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా డాక్టర్ కుమార్ రాజా మాట్లాడుతూ..గ్రామ ప్రజలకు పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు.గర్భిణులు,బాలింతలు, చిన్నారులు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు,ముఖ్యంగా బీపీ, షుగర్,రక్తహీనత,చిన్నారుల ఎదుగుదల లోపాలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందాలని తెలిపారు. పాన్,గుట్కా,బీడీ,సిగరెట్, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలని,నడక,శారీరక శ్రమతో పాటు చిరుధాన్యాలు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు,డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి అవసరమైతే ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించాలని కోరారు,ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రుక్మిణి,ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, ఎర్రమ్మ,సంచార వైద్యశాల సిబ్బంది పక్రుద్దీన్,ఆశా కార్యకర్తలు గంగమ్మ,మంజుల, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కరువు సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ దీక్ష



**బొమ్మనహాల్ మన జనప్రగతి సెప్టెంబర్ 21**:-రాయదుర్గం పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట కరువు సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో దీక్షలు నిర్వహించారు,ఈ దీక్ష కార్యక్రమానికి సీపీఎం,కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ,ఆర్‌సీపీఐ పార్టీలు దీక్షలకు సంఘీభావం తెలిపాయి,అనంతరం సీపీఐ రాయదుర్గం నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ..కరువు పరిస్థితులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు, రైతు రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని,తాగు, సాగునీరు అందించాలని, పశువులకు దాణా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులను మరో 100 రోజులు పెంచి రోజుకు రూ.500 కూలి చెల్లించాలని కోరారు,ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం,కాంగ్రెస్,ఆమ్ ఆద్మీ, ఆర్‌సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**చిట్వేలి మనజనప్రగతి సెప్టెంబర్ 21**:-చిట్వేలి మండల పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, పంటలకు గిట్టుబాటు ధరలు, ఎరువుల కొరత, పంటల బీమా తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పందికాళ్ల మణి డిమాండ్ చేశారు. సోమవారం చిట్వేలి మండల తహసీల్దార్ నరసింహారావు కు రైతులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ ఎరువుల కోసం వివిధ యాప్‌లను తప్పనిసరి చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూములు ఉన్నప్పటికీ ఈ-కేవైసీ, వేలిముద్ర, ఆధార్ లింక్ తదితర కారణాలతో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి సంక్షేమ పథకాలు పలువురు రైతులకు అందడం లేదన్నారు. రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని, పంటలకు ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించాలని, కౌలు రైతులను ఆదుకోవాలని, ఎరువులకు సంబంధించిన యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 22-ఏ భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు భూములు ఉన్న ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలు వర్తింపజేయాలని కోరారు. గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలని, పశువులకు ఉచితంగా మేత అందించాలని, బొప్పాయి రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి శంకరయ్య, ఒలిమి నాగయ్య, వేమన తిరుపయ్య, జ్యోతి నాగేష్‌తో పాటు రైతులు సుబ్బరాయుడు, చలపతి, రాజు, మారే ఉదయ్‌కుమార్, సట్టి శంకరయ్య పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

**పులివెందులలో 83 మందికి రూ.40.16 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

**పేదలను ఆదుకోవడమే ప్రధాన లక్ష్యం: జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 21**:-కష్టకాలంలో ఉన్న పేద ప్రజలకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి స్పష్టం చేశారు.పులివెందుల నియోజకవర్గానికి చెందిన 83 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.40,16,350 విలువైన చెక్కులను స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆమె లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా మారెడ్డి లతారెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలిక,తీవ్ర అనారోగ్య సమస్యలతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థికంగా చితికిపోయిన బాధితులు తమ గోడును టీడీపీ పులివెందుల ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు.వారి వినతులపై బీటెక్ రవి తక్షణమే స్పందించి,ధ్రువపత్రాలను పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసు చేయడంతోనే ఇంత పెద్ద మొత్తంలో సాయం మంజూరైందని ఆమె వివరించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక తోడ్పాటు లభించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.తమను ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు,ప్రత్యేక చొరవ చూపిన బీటెక్ రవికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ స్థానిక నాయకులు,కార్యకర్తలు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిలో చేరిన బండారు శివకేశవ



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 21**:- వ్యక్తి పూజ కాదు దేశ భద్రత ముఖ్యమంటూ 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బండారు నాగ మల్లిక భర్త బండారు శివకేశవ తెలిపారు. సోమవారం భారతీయ జనతా పార్టీ ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి. నాగోతు రమేష్ నాయుడు. జంగిటి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బండారు శివకేశవ బిజెపిలో చేరి పార్టీ కలవకప్పుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అనేక పార్టీలలో వ్యక్తి పూజతో రాజకీయాలు నడుస్తున్నాయని సమాజ శ్రేయస్సు దేశ భద్రతకు పాటుపడేది ఒక భారతీయ జనతా పార్టీ అని తెలిపారు. మొదట్లో కూడా ఆర్ఎస్ఎస్ బాబాజాలం నాలో మెండుగా ఉండేదని తెలిపారు. ఈరోజు నా మాతృ సంస్థలో చేరడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం సర్వశక్తులు వడ్డీ పని చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో దయాకర్ రెడ్డి, శశిభూషణ్ రెడ్డి,చేవూరి శారద,కోడూరు మల్లికార్జున,లక్ష్మీనారాయణ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి,కామినేని ప్రవీణ్ నాయుడు,వివి చలపతి తదితరుల నాయకులు పాల్గొన్నారు.

# ఓబులవారిపల్లెలో తొమ్మిదవ పోషణ మాసోత్సవం



**చిట్వేలి మనజనప్రగతి సెప్టెంబర్ 21**:-ఓబులవారిపల్లి-2 అంగన్వాడీ సెంటర్ నందు 9వ రాష్ట్రీయ పోషక మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్.సూపెర్వైసర్ గుణవతి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకు కూరలు, పండ్లు,పాలు,గుడ్లు,అంగన్వాడి సెంటర్ లో ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణీలు, చిన్నపిల్లల తల్లులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదనపు ఆహారము కూడా గర్భవతులు, బాలింతలు 6 నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలు తగినంత పోషక విలువలు ఉండే విధంగా ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు.ఆహారంతోపాటు వ్యాధి నిరోధక టీకాలు కూడా వేయించుకోవాలని తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకొనే బాధ్యత మనం కలిగి వుండాలని పేర్కొన్నారు. శిశు ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రతేక ప్రణాళిక అంగన్వాడీ ద్వారా జరిపిస్తోందని చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త,శ్యామల,గర్భవతులు,బాలింతలు,పిల్లల తల్లులు పాల్గొన్నారు.

# స్వర్గీయ బాపతి వెంకట రమేష్ చంద్రారెడ్డి వర్ధంతి

**- దివ్యాంగులకు చేయూత**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 21**:-పట్టణ ప్రముఖ వ్యాపారి దివంగత బాపతి వెంకటరామిరెడ్డి కుమారుడు స్వర్గీయ బాపతి వెంకట రమేష్ చంద్రారెడ్డి 20వ వర్ధంతి సందర్భంగా వారి మాతృమూర్తి నరసమ్మ స్థానిక దివ్యాంగుల టైలరింగ్ శిక్షణ కేంద్రానికి ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి మాట్లాడుతూ రమేష్ చంద్రారెడ్డి చిన్న వయసులోనే మరణించడం బాధాకరమని వారి కుటుంబం సమాజ సేవలో ముందుండడం అభినందనీయమని కొనియాడారు.అనంతరం రమేష్ చంద్రారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి,దివ్యాంగులకు పండ్లు,మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ టీచర్ మల్లీశ్వరి,సహకార్యదర్శి మహమ్మద్ రఫీ,కుటుంబ సభ్యులు,శిక్షణార్థులు పాల్గొన్నారు.

# నేడు పులివెందులలో 'హామ్' ప్రాజెక్టుల వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమం

**మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లు**

**కుప్పం నుంచి ప్రారంభించనున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 21**:- పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఎఎం) విధానంలో చేపట్టనున్న వివిధ ప్రాజెక్టుల వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు పులివెందుల మున్సిపల్ కమిషనర్ శివ తనూజ తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటన నుంచి ఈ ప్రాజెక్టులను వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించి,శ్రీకారం చుట్టనున్నారు.నేటి ఉదయం 9:30 గంటలకు పులివెందుల మున్సిపాలిటీ నూతన కార్యాలయ భవనంలో ప్రత్యేకంగా వర్చువల్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.పట్టణ ప్రముఖులు,ప్రజలు,అధికారులు సకాలంలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆహ్వానించారు.

# పాత్రికేయ గణపతికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేక పూజలు



**కర్నూలు, మన జనప్రగతి సెప్టెంబర్ 21** :- పాత్రికేయ గణపతి మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ సోమవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వినాయకుడికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం పాత్రికేయ గణపతి మహోత్సవ సమితి సభ్యులు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది పాత్రికేయ గణపతి మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, జిల్లాలో శాంతిభద్రతలు మరింత పటిష్టంగా ఉండాలని వినాయకుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాత్రికేయ గణపతి మహోత్సవ సమితి సభ్యులు, పాత్రికేయులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ రహిత జిల్లాగా అన్నమయ్యను తీర్చిదిద్దుదాం

**• అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**అన్నమయ్య బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 21:-**ప్రజలందరి సహకారంతో అన్నమయ్య జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు.సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించనున్న 'మొబిలైజేషన్ ఆఫ్ ఎయిడ్స్ సురక్ష' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఐవీ వ్యాప్తికి అధిక అవకాశాలు ఉన్న హైరిస్క్ వ్యక్తులను గుర్తించి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. హెచ్ఐవీ నిర్ధారణ అయిన వారికి ఏఆర్‌టీ మందులను క్రమం తప్పకుండా వినియోగించేలా అవగాహన కల్పించాలని తెలిపారు.ఐసీటీసీ కేంద్రాల్లో హెచ్ఐవీ పరీక్షా కిట్లు, ఏఆర్‌టీ మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హెచ్ఐవీ నియంత్రణలో నిర్దేశించిన మొదటి, రెండో, మూడో లక్ష్యాలను సాధించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, డీసీహెచ్ఎస్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, డీఎల్‌టీఓ డాక్టర్ రాధిక, సీపీఓ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి

**- వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల నాయకులు, కార్యకర్తలకు పిలుపు**



**పత్తికొండ మన జనప్రగతి సెప్టెంబర్ 21:-**వెల్దుర్తి పట్టణంలోని లిమ్రాస్ ఫంక్షన్ హాల్‌లో వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ బలోపేతం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయంపై సమావేశంలో చర్చించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీలో ఎలాంటి వర్గ విభేదాలు లేకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు తీరును ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నవరత్నాల హామీల అమలుకు కృషి చేశామని, కరోనా సమయంలోనూ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించామని వారు పేర్కొన్నారు.అనంతరం అనుబంధ సంఘాల నాయకులు, రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులకు వైఎస్సార్‌సీపీ ఐడీ కార్డులను పంపిణీ చేశారు.సమావేశంలో కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ వెంకటరామిరెడ్డి, మండలాల కన్వీనర్లు రవిరెడ్డి, ఆర్.బి. వెంకటరాముడు, జడ్పీటీసీ దాదపోగు సుంకన్న, రాష్ట్ర ఆర్టీఐ ప్రధాన కార్యదర్శి కొత్తూరు వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కటారుకొండ మాధవరావు, రైతు విభాగం నాయకులు బింగిదొడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, యువజన విభాగం నాయకులు బోయినపల్లి అశోక్‌రెడ్డి, బుక్కాపురం శంకర్‌రెడ్డి, పుల్లగుమ్మి నాగార్జునరెడ్డి, నరసాపురం కృష్ణారెడ్డి, వెల్దుర్తి పెద్దిరెడ్డి, పలువురు సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరువును రాష్ట్ర విపత్తుగా ప్రకటించాలి

**రైతులకు తక్షణమే పంట నష్టపరిహారం అందించాలి**

**కేంద్రం నుంచి రూ.1 లక్ష కోట్ల సహాయం తీసుకురావాలి:కే.లోకనాథం**



**పత్తికొండ మన జనప్రగతి సెప్టెంబర్ 21:-**పత్తికొండ నియోజకవర్గంలో సీపీఎం కేంద్ర కమిటీ కరువు బృందం సోమవారం పర్యటించింది. కేంద్ర కమిటీ సభ్యులు కే. లోకనాథం, రాధాకృష్ణ, ఆనంద్‌బాబు, అంజిబాబు తదితరులు దేవనకొండ మండలంలోని ఈదుల దేవరబండ, కప్పట్రాళ్ల గ్రామాల్లో పర్యటించి పండ్లతోటలు, సాగు పంటలను పరిశీలించారు. వర్షాభావ పరిస్థితులతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పత్తికొండలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కే. లోకనాథం మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఉల్లి, టమాటా, మిరప, ఆముదం, సద్ద, జొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. పంటల సాగు కోసం రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదన్నారు.కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కరువును రాష్ట్ర విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.1 లక్ష కోట్ల సహాయం తీసుకురావాలని కోరారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో రైతులకు తక్షణ పంట నష్టపరిహారం అందించడంతోపాటు పశుగ్రాసం, తాగునీరు, ఉపాధి హామీ పనిదినాల పెంపు వంటి చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.కరువు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యక్షంగా పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకుంటున్నామని సీపీఎం నాయకులు తెలిపారు. రైతుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాటం చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పత్తికొండ సీపీఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర, సీనియర్ నాయకులు రంగారెడ్డి, వెంకటేశ్వర్లు, దస్తగిరి, గోపాల్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసిపి నాయకులు దౌర్జన్యాలు చేయడం హేయమైన చర్య

**రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాజులు ఖాదర్బాషా**




**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబర్ 21:-**డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసిపి నాయకులు దౌర్జన్యాలు చేయడం కట్టలు ఇనుప రాడ్లు తీసుకొని రౌడీయిజం చేయడం నీచమైన హేయమైన చర్య అని గాజుల ఖాదర్బాషా పేర్కొన్నారు..సోమవారం నాడు మంత్రి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీ నియామక ప్రక్రియ ను మంత్రి నారా లోకేష్ పూర్తి పారదర్శకతతో పూర్తి చేశారని స్పష్టం చేశారు వైసిపి నాయకులు చేస్తున్న నిరాధార ఆరోపలన్నిటికీ కూడా ఇప్పటికే ఆధారాలతో సహా సమాధానం ఇచ్చామని కోర్టులు కూడా ఈ ప్రక్రియను పారదర్శకతను ధ్రువీకరించాయని తెలిపారు.వైసిపి హయాంలో ఉద్యోగాలు ఇవ్వక నిరుద్యోగులకు పొట్ట కొట్టి ఇప్పుడు పారదర్శకంగా ఉద్యోగాలు ఇచ్చారని ఏదోరకంగా వక్రీకరించి బురద చల్లాలని వైసిపి నాయకులు చేస్తున్న చర్యలకు ఉద్యోగులు మరియు నిరుద్యోగులు గట్టిగా సమాధానం చెప్తారని తెలిపారు అవినీతికి కేరాఫ్ అడ్రస్ వైసిపి పార్టీ అని నీతి నిజాయితీకి మారుపేరు తెలుగుదేశం ప్రభుత్వం ఒక్కటే అని బల్ల గుద్ది చెప్పారు శాప్ కార్యాలయం వద్దకు జోగి రమేష్. దేవినేని అవినాష్ వారి అనుచరులు కట్టలతో రాడ్లతో మరియు రాళ్లతో స్వైర విహారం. రౌడీయిజం చేయడం చాలా క్రూరమైన చర్య అని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాన్ని చుట్టుముట్టి స్పోర్ట్స్ టీచర్లపై దాడి చేసి చాలా నిజమైన హేయమైన చర్య అని చెప్పారు మీ చాటాకు తప్పట్లకు మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ధైర్యంగా ఎదుర్కొంటారని ఒంటిమిట్టలో బై ఎలక్షన్లలో వైసిపి నాయకులు భయపడి పరిగెత్తిన విషయం కూడా ఒక్కసారి గుర్తు చేసుకోవాలని హితవు పలికారు అటువంటి పరిస్థితులు తెచ్చుకోకుండా వైసిపి నాయకులు ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకు సహకరించి ప్రజలలో అభాసుపాలు కావడం మంచిది కాదని హితవు పలికారు.ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు విద్యాధర్ దేవేంద్ర జయరామిరెడ్డి పదో వాడు అధ్యక్షుడు శశి జాబీర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఖాదర్. సంతోష్ . హరి. రోఫా రఫీ హైదర్ రాజారెడ్డి అమీర్ భాషా తదితరులు పాల్గొన్నారు

# కాంట్రాక్టు ఉద్యోగుల వినూత్న నిరసన

**సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్**

**అక్టోబర్ 3లోగా స్పందించాలి...**

**లేదంటే విధుల బహిష్కరణ**



**లింగాల మన జనప్రగతి సెప్టెంబర్ 21:-**మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 21 నుంచి వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగిస్తున్నామని ఉద్యోగులు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం నల్ల దుస్తులు ధరించి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు.సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, 100 శాతం గ్రాస్ వేతనం చెల్లించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు ప్రభుత్వ అధికారులు, సంబంధిత శాఖల అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ స్పందన లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమితమై ప్రాణాలను కాపాడుకునే పరిస్థితుల్లో వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు సిబ్బంది తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వహించారని గుర్తుచేశారు. ఆ సమయంలో పలువురు ఉద్యోగులు కరోనా బారినపడి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని, కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.కరోనా సమయంలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల కుటుంబాలకు ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి తగిన పరిహారం అందలేదని, దీంతో ఆయా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించేందుకు అక్టోబర్ 3వ తేదీ వరకు గడువు ఇస్తున్నామని తెలిపారు. అప్పటిలోగా తమ డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే అక్టోబర్ 4వ తేదీ నుంచి విధుల బహిష్కరణ చేపడతామని ఉద్యోగ నాయకులు హెచ్చరించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ సమస్యలను సానుకూలంగా పరిశీలించి, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంతో పాటు కాంట్రాక్టు ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# డ్వాక్రా మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

**సైబర్ మోసాలు,బీమా పథకాలపై అవగాహన కల్పించిన అధికారులు**

**పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 21:** పార్నపల్లి రోడ్డు లోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలో డ్వాక్రా మహిళలకు ఆర్థిక అక్షరాస్యత,ఆన్‌లైన్ సైబర్ మోసాలు (సైబర్ ఫ్రాడ్స్ ), కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత కేంద్రం (యఫ్ ఎల్ సి - పులివెందుల) కౌన్సిలర్ నాగలక్ష్మి మాట్లాడుతూ మహిళలు పొదుపుతో పాటు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక,బీమా పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ బీమా పథకాలైన పీఎంఎస్‌బీవై (ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన - పిఎంఎస్‌బివై) సంవత్సరానికి కేవలం రూ 20 చెల్లిస్తే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు బాధిత కుటుంబానికి రూ 2 లక్షల వరకు బీమా పరిహారం అందుతుందని తెలిపారు.పీఎంజేజేబీవై (ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పీఎంజేజేబీవై)సంవత్సరానికి రూ 436 ప్రీమియంతో సాధారణ మరణం లేదా గుండెపోటు (హార్ట్ ఎటాక్) వంటి కారణాలతో మరణించినా నామినీకి రూ 2 లక్షల బీమా అందుతుందని వివరించారు. ఏపీవై (అటల్ పెన్షన్ యోజన - ఏపీవై) వృద్ధాప్యంలో క్రమం తప్పకుండా స్థిరమైన పింఛను పొందేందుకు అటల్ పెన్షన్ యోజన ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.అలాగే ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు,బ్యాంకు వివరాలు చెప్పకూడదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం పులివెందుల సిబ్బందితో పాటు స్థానిక డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన పంజాబ్ జర్నలిస్టుల బృందం






**విజయవాడ మన జనప్రగతి సెప్టెంబర్ 21:-** కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, వాటి ద్వారా జరుగుతున్న అభివృద్ధిని క్షేత్రస్థాయిలో పరిశీలించే లక్ష్యంతో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పర్యటిస్తున్న పంజాబ్ జర్నలిస్టుల బృందం సోమవారం ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, ఫైనాన్స్ అధికారి ప్రొఫెసర్ ఎం. శరత్‌చంద్రబాబు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక బృందంతో పాత్రికేయులు ప్రత్యేకంగా సమావేశమై ముఖాముఖి నిర్వహించారు. విశ్వవిద్యాలయ పనితీరు, విద్యార్థులకు అందిస్తున్న ఉన్నత విద్యావకాశాలు, ప్రాంతీయ ప్రజల అభ్యున్నతికి సంస్థ చేపడుతున్న విద్యా, పరిశోధనా పురోగతిని అధ్యాపక బృందం జర్నలిస్టులకు సమగ్రంగా వివరించింది. గిరిజన ప్రాంతాల్లో ఉన్నత విద్యను విస్తరించడం, గిరిజన విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, పరిశోధనకు అందిస్తున్న అవకాశాలు, గిరిజన సంస్కృతిసంప్రదాయాల పరిరక్షణ తదితర అంశాలపై జర్నలిస్టులతో చర్చించారు. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ జర్నలిజం విభాగాధిపతి డా. తారేకేశ్వరరావు ఇప్పిలి కోఆర్డినేట్ చేశారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయ అధ్యాపక సిబ్బంది, పీఐబీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణ నడుమ నిమజ్జనం జరుపుకోవాలి: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 21:**-మంగళవారం కర్నూలు పట్టణంలో నిర్వహించే నిమజ్జన కార్యక్రమంలో ప్రజలు ప్రశాంత వాతావరణం నడుమ నిమజ్జనంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. మంగళవారం అనే సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. నగరంలో నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జన ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రతకు తీసుకున్న చర్యలను వివరించారు.కర్నూలు నగరంలో 1,000కు పైగా గణేష్ విగ్రహాలు ఉన్నాయని, సాధారణంగా కర్నూలు నగరంలోని వినాయక్ ఘాట్‌లో నిమజ్జనం నిర్వహిస్తారన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి లభ్యత తక్కువగా ఉండటంతో వినాయక్ ఘాట్‌తో పాటు నన్నూరు, ఉలిందకొండ ప్రాంతాల్లో అదనపు నిమజ్జన ఘాట్లను ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు వన్‌టౌన్ పరిధిలోని రాంభొట్ల దేవాలయం పరిసరాల నుంచి నిమజ్జన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.నిమజ్జన మార్గాలు, ఘాట్ల వద్ద కలిపి సుమారు 1,700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నంద్యాల, కడప, అనంతపురం జిల్లాల నుంచి వచ్చిన అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు బందోబస్తు కొనసాగుతుందన్నారు.నిమజ్జనానికి వచ్చే ప్రజలు పోలీసుల భద్రతా సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నన్నూరు, ఉలిందకొండ ప్రాంతాల్లో నీటి ప్రవాహం, నీటి లోతు ఎక్కువగా ఉన్నందున మరింత జాగ్రత్తగా ఉండాలని, నిర్దేశించిన ప్రాంతాల్లోనే నిమజ్జనం నిర్వహించాలన్నారు. పిల్లలు, వృద్ధులు నీటి ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి కర్నూలు నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు అమల్లో ఉంటుందన్నారు. భారీ వాహనాలకు నగరంలో అనుమతి ఉండదని, అవసరాన్ని బట్టి ప్రధాన రహదారులపై వన్‌వే విధానం అమలు చేస్తామన్నారు. కొన్ని మార్గాల్లో ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. సీ క్యాంప్ నుంచి ఎక్కువ సంఖ్యలో గణేష్ విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున, అక్కడి నుంచి హైవే దాటి గణేష్ ఘాట్‌కు వచ్చే మార్గాల్లో ప్రత్యేక ట్రాఫిక్, భద్రతా చర్యలు చేపట్టామన్నారు. నిమజ్జన కార్యక్రమంలో నిబంధనలకు లోబడి డీజేలు నిర్వహించాలని, నిర్దేశించిన శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాలన్నారు. అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, వాహనదారులు పోలీసులకు సహకరించాలన్నారు.

# దివ్యాంగ చిన్నారుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 21:**-దివ్యాంగ చిన్నారుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కనబరుస్తోందని జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త వెంకటసుబ్బయ్య అన్నారు. వేంపల్లి లోని భవిత దివ్యాంగ విద్యావనరుల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమగ్ర శిక్ష, అ లింకో కాన్పూర్ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులకు టీచింగ్,లెర్నింగ్ మెటీరియల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ చిన్నారుల వయసు అవసరాలను బట్టి బేస్ గ్రూప్ ఆధారంగా ఈ కిట్లను పంపిణీ చేశామన్నారు.ఈ ఇట్లు విద్యార్థుల విద్యాభ్యాసానికి నైపుణ్యాల, అభివృద్ధికి సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడతాయన్నారు. ఒక్కొక్క కిట్ రూ 10 వేలకు పైగా విలువవుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు వెంకటరామిరెడ్డి, స్టాలిన్ ఐజాక్, జడ్పీ ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్,ఐఈఆర్టీలు యశోద, సుజాత సిజివి సుజాత దివ్యాంగ చిన్నారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గురజాడ గొప్ప స్ఫూర్తి దాత: మాజీ ఎంపీ తులసి రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 21:**-స్వర్గీయ గురజాడ అప్పారావు గొప్ప స్ఫూర్తి దాత,అభ్యుదయ కవితా పితామహుడని, నవయుగ వైతాళికుడని,గొప్ప సంఘసంస్కర్త అని రాజ్యసభ మాజీ సభ్యుడు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు . వేంపల్లి లో సోమవారం కాంగ్రెస్ నాయకులు గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన సతీమణితో కలిసి గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశమంటే మట్టికాదోయ్ - దేశమంటే మనుషులోయ్ అన్న సందేశాన్ని సమాజానికి అందించిన గొప్ప దేశభక్తుడు, సంఘసంస్కర్త స్వర్గీయ గురజాడ అన్నారు. బాల్య వివాహాలు, కన్యాశు ల్కం వంటి సాంఘిక దురాచారాలను నిర్మూలించేటందుకు ఆయన సాహిత్యాన్ని,వాడుక భాషను ప్రయోగించారన్నారు.గురజాడ గొప్ప మానవతావాది స్త్రీ జనోద్ధరణ,సంఘ సంస్కరణ,భాషోద్యమం ఈ మూడింటిని సమంగా నడిపించిన మార్గదర్శి గురజాడ అని ఆయన పేర్కొన్నారు. సమాజం మీద గురజాడ విసిరిన సాహితీ బ్రహ్మాస్త్రమే కన్యాశుల్కం నాటకం.ఒక గిరీశం,బుచ్చమ్మ,ఒక మధురవాణి తెలుగు నాటకంలో సజీవ పాత్రలన్నారు . ఆయన వ్రాసిన పుత్తడి బొమ్మ - పూర్ణమ్మ, ముత్యాల సరాలు, సుభద్ర,నీలగిరి కోటలు గురజాడ ప్రతిభకు ఆనవాళ్ళని, గురజాడ అడుగుజాడలు మన ప్రగతికి మైలురాళ్లని తులసి రెడ్డి వివరించారు.ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,వేముల మండల శాఖ అధ్యక్షుడు చాగలేటి వెంకటేశు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటి పట్టణాభివృద్ధికి రూ.244.32 కోట్ల నిధులు

## తాగునీరు,డ్రైనేజీ,రహదారులు, పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యం

## ముఖ్యమంత్రి చంద్రబాబు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు మంత్రి మండిపల్లి కృతజ్ఞతలు



**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబర్ 21:**-రాయచోటి పట్టణ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.244.32 కోట్ల భారీ నిధులు కేటాయించిందని రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలన్న తన విజ్ఞప్తి మేరకు పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ద్వారా వివిధ పథకాల కింద ఈ నిధులు మంజూరైనట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా సురక్షితమైన తాగునీటి సరఫరా, నీటి వనరుల పునరుద్ధరణ, డ్రైనేజీ వ్యవస్థ, ఘన-ద్రవ వ్యర్థాల నిర్వహణ, నాణ్యమైన రహదారులు, డివైడర్లు, పార్కులు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులను వినియోగించనున్నట్లు తెలిపారు.అమృత్ 2.0 పథకం కింద తాగునీటి సరఫరా, నీటి వనరుల పునరుద్ధరణకు రూ.3.68 కోట్లు కేటాయించగా, పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఎస్‌బీఎం 2.0 కింద ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు రూ.4.96 కోట్లు కేటాయించి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కేటాయింపుల ద్వారా రోడ్లు, డ్రైన్లు, పూడికతీత పనులకు మరో రూ.3.68 కోట్లు కేటాయించారని తెలిపారు.ఈ మూడు విభాగాల్లో ప్రస్తుతం జరుగుతున్న పనుల మొత్తం విలువ రూ.12.32 కోట్లుగా ఉందన్నారు. భవిష్యత్ పట్టణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హెచ్ఏఎం విధానం ద్వారా రోడ్లు, డివైడర్లు, పార్కులు, వీధి దీపాల కోసం రూ.35 కోట్లు కేటాయించగా, ఈ పనులు ప్రస్తుతం టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు.అత్యంత ప్రాధాన్యత కలిగిన యూఐడీఎఫ్-4 పథకం కింద రాయచోటి పట్టణంలో తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధికి రూ.197 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ పనులు ప్రస్తుతం పాలనా అనుమతుల దశలో ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో వివిధ పథకాల కింద రాయచోటి పట్టణ అభివృద్ధికి కేటాయించిన నిధుల మొత్తం రూ.244.32 కోట్లకు చేరిందన్నారు.రాయచోటి పట్టణ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తూ, చేపట్టిన పనులను నిర్ణీత సమయంలో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తామని చెప్పారు.రాయచోటి పట్టణాన్ని మరింత అభివృద్ధి చెందిన, మెరుగైన మౌలిక వసతులతో కూడిన పట్టణంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు.

# దసరా ఉత్సవాలను ఐక్యతతో విజయవంతం చేద్దాం

## - వేంపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 21:**-స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు అక్టోబర్ 11వతేది నుండి నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తోటంశెట్టి చంద్రశేఖర్,ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు రాయవరం సుబ్బు తెలిపారు.ఈ సందర్భంగా సోమవారం ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో పందిరి పూజ చేశారు.ముందుగా గణపతి పూజ భూమి పూజ చేసి అనంతరం శు భముహూర్తంలో దసరా ఉత్సవాల పందిరికి స్థంభ పూజా చేసి స్థంభస్థాపన చేశారు.అక్టోబర్ 11వతేది నుండి 22వతేది వరకు 12రోజుల పాటు దసరా ఉత్సవాలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం,ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కల్యాణ మండపం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# సామాజిక సేవను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలి

## • జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షుడు వివేకానంద రెడ్డి




**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 21:**-సామాజిక సేవా ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షులు, కడప ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వివేకానంద రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కడప ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లడ్ గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. రక్తదానం చేయడం వలన ఎలాంటి ఆరోగ్యం క్షిణించదన్నారు. ప్రతి ఒక్కరూ తమ బ్లడ్ గ్రూపును తెలుసుకోవడంతో పాటు, అర్హత ఉన్నవారు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు.యువతలో రక్తదానంపై మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో రక్తదానం, రక్తం ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. అనంతరం సిఐ నరసింహులు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కూడ రక్తదానం చేయవచ్చు అన్నారు. రక్తదానం చేయడం వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని తెలిపారు. గర్భవతులకు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వారి ప్రాణాలను కాపాడేందుకు రక్తం అవసరం అవుతుందని తెలిపారు. బ్లడ్ గ్రూప్ తెలిస్తే తొందరగా రక్త సేకరణ చేయడానికి వీలు ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 21న ప్రతి ఎడాది జరిగే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి రెడ్ క్రాస్ సొసైటీ రక్తాన్ని అందజేయడం జరుగుతున్నదని తెలిపారు. అపరేషన్ చేసే సమయంలో కూడ రక్తం అవసరం ఉంటుందని తెలిపారు. కంప్యూటర్ యూగంలోకి రావడం జరిగిందని కాబట్టి ప్రతి బాలికలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. మోసాలకు గురి కాకుండా ఉండాలని కోరారు. ఫోటోలను కూడ వాట్సాప్ లో, ఫేస్ బుక్ లో పెట్టరాదని సూచించారు. సైబర్ నేరాలపై కూడ అప్రమత్తంగా ఉండాలని కోరారు. టెక్నాలజీ ప్రకారం నేరాల్లో పాలుపంచుకుంటే విద్యార్థుల భవిష్యత్తు అంధకారమే అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదంలో పడే అవకాశం ఉంటుందని చెప్పారు. శక్తి యాప్ పై కూడ మహిళాలు అవగాహన కల్గి ఉండాలని కోరారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి వారి బ్లడ్ గ్రూపులను నిర్ధారించారు. అలాగే కడప రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సిఐ నరసింహులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఉషశ్రీ లను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఉషశ్రీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జనార్ధన్ రెడ్డి, కడప రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు సుధాకర్, ఓబుల్ రెడ్డి, వేంపల్లె రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఫయాజ్ ఖాన్, షేక్. సంధాని, మహబుబ్ షరీఫ్, మహేష్ కుమార్ రెడ్డి, రాహుల్, యాసిన్ తో పాటు వైద్యులు, విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# యోగసన పోటీలలో బంగారు పతకాలు సాధించిన ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 21:**-జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. కడప లోని డి.ఎస్.ఏ స్టేడియంలో ఈ నెల 19 నిర్వహించిన 7వ జిల్లా స్థాయి యోగాసనా భారత్- కడప 2026 పోటీల్లో ట్రిబుల్ ఐటీ కి చెందిన 41 మంది విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. ఈ పోటీల్లో విద్యార్థులు 31 బంగారు,10 వెండి,3 రజత పతకాలను సాధించారు.ఈ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచడం పట్ల డైరెక్టర్ ఆచార్య గడ్డం విజయప్రకాష్ ఏవో రవికుమార్ అకాడమిక్ డీన్ రమేష్ కైలాస్, ఎఫ్ ఓ రమేష్, యోగాసనం మాస్టర్లు హర్షం వ్యక్తం చేశారు.

# హనుమద్ వాహనంపై శ్రీ రంగనాథస్వామి దర్శనం

## - భక్తిశ్రద్ధలతో సాగిన నూలు పూజ ఉత్సవాలు

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 21:**పులివెందుల పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న నూలు పూజ ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ రంగనాథస్వామి వారు శ్రీదేవి,భూదేవి సమేతులై విశేష అలంకరణలో హనుమద్ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు.స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి,మొక్కులు తీర్చుకున్నారు.హనుమద్ వాహనంపై దర్శనమిచ్చిన స్వామివారి దివ్యమంగళ రూపాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి,తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ (ఎండోమెంట్స్) సిబ్బంది,ఆలయ కమిటీ సభ్యులు,అర్చకులు,స్థానిక ప్రజలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174